

వరద గోదావరి

ధర్మపురి: ఎగువన కురుస్తున్న భారీవర్షాలతో గోదావరి నది వరద ఉధృతి పెరిగింది. భక్తులు పుష్కరఘాట్ల వద్దే స్నానాలు చేశారు.



ఆస్పత్రి సందర్శన

పెగడపల్లి : స్థానిక పీహెచ్‌సీని డీఎంహెచ్‌వో శ్రీధర్ ఆకస్మికంగా సందర్శించారు. సీజనల్ వ్యాధులపై సిబ్బందికి సూచనలు చేశారు.

గరిష్టం/కనిష్టం

26.0/24.0

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

24న జాబ్‌మేళా

జగిత్యాలటౌన్: నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించేందుకు ఈనెల 24న జిల్లా కేంద్రంలో జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి కల్పన అధికారి సత్యమ్మ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. హైదరాబాద్‌లోని ఆదర్శ నెక్సా సంస్థలో టీంలీడర్, సేల్స్ ఎగ్జిక్యూటివ్స్ రిలేషన్‌షిప్ ఆఫీసర్, సీనియర్ రిలేషన్ ఆఫీసర్, సర్వీస్ అడ్వైజర్, సేల్స్ ఎగ్జిక్యూటివ్స్ ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయన్నారు. 20 - 40మధ్య వయసు కలిగిన ఎస్సెస్సీ, ఇంటర్, డిగ్రీ, డిప్లొమా, మెకానికల్, ఐటీఐ, డీజిల్ మెకానిక్, ఎలక్ట్రీషియన్, వెల్డర్ తదితర కోర్సుల్లో ఉత్తీర్ణులైనవారు అర్హులన్నారు. ఆసక్తి, అర్హత కలిగిన వారు తమ బయోడేటా, సర్టిఫికెట్లతో నేరుగా జిల్లా ఉపాధి కల్పన అధికారి కార్యాలయం, జిల్లా కార్యాలయాల సముదాయం, రూం నంబర్ 218లో సోమవారం హాజరు కావాలన్నారు. ఉదయం 11గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు జాబ్ మేళా నిర్వహిస్తామని వివరించారు. వివరాలకు మొబైల్ నంబర్లు 99631 77056, 90524 33361లో సంప్రదించాలని కోరారు.

ఆస్పత్రిలో విచారణ

సాక్షి ఎఫెక్ట్..

రాయికల్(జగిత్యాల): పట్టణంలోని వైద్య విధాన పరిషత్ ఆస్పత్రిలో శుక్రవారం ఆర్‌ఎంవో రామకృష్ణ ఆధ్వర్యంలో విచారణ చేపట్టారు. 'ప్రభుత్వ ఆస్పత్రిలో ప్రైవేట్ వైద్యురాలి సేవలు' శీర్షికన ఈనెల 20న 'సాక్షి'లో ప్రచురితమైన కథనంపై కలెక్టర్ యాస్మిన్ బాషా స్పందించారు. ఆస్పత్రికి వెళ్లి పూర్తిస్థాయిలో విచారణ జరపాలని ఆర్‌ఎంవోను కలెక్టర్ ఆదేశించారు. దీంతో ఆయన ఆస్పత్రికి చేరుకుని వివరాలు సేకరించారు. నివేదికను కలెక్టర్‌కు అందజేయనున్నట్లు ఆర్‌ఎంవో తెలిపారు.

రెన్యూవల్ చేయాలి


జగిత్యాలటౌన్: ఇంటర్మీడియెట్ కళాశాలల్లోని గెస్ట్ లెక్చరర్లను ఈ విద్యాసంవత్సరంలోనూ రెన్యూవల్ చేయాలని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి కోరారు. ఈమేరకు శుక్రవారం ఇంటర్మీడియెట్ విద్యా కమిషనర్ నవీన్‌మిట్టల్‌కు ఎమ్మెల్సీ లేఖ రాశారు. గెస్ట్ లెక్చరర్లను పరిగణనలోకి తీసుకోకుండా మెరిట్ ప్రాతిపదికన కొత్తవారిని నియమించేదుకు ఇంటర్ బోర్డు నోటిఫికేషన్ జారీచేయడంతో రాష్ట్రంలోని 1,654మంది ఉపాధి కోల్పోయి వారి కుటుంబాలు రోడ్డున పడే పరిస్థితి నెలకొందని ఆందోళన వ్యక్తం చేశారు. వారికి ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు.

ఎస్సారెస్పీకి 92,590 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

జగిత్యాలఅగ్రికల్చర్: జిల్లాకు సాగు, తాగునీరు అందించే శ్రీరాంసాగర్ ప్రాజెక్టుకు ఎగువ ప్రాంతాల నుంచి భారీగా వరదనీరు వచ్చి చేరుతోంది. కొద్దిరోజులుగా ఎగువ ప్రాంతాల్లో వర్షాలు కురుస్తుండటంతో వరద వస్తోంది. శుక్రవారం రాత్రి 8 గంటల వరకు 92,590 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో కొనసాగుతోంది. ప్రాజెక్ట్ నీటిమట్టం 1,091.00అడుగులకు ప్రస్తుతం 1,077.00 అడుగులుగా ఉంది. నీటినిల్వ సామర్థ్యం 90.3 టీఎంసీలకు ప్రస్తుతం 44.701 టీఎంసీలు ఉంది. ప్రస్తుతం ప్రాజెక్ట్ నుంచి 632 క్యూసెక్కుల అవుట్‌ఫ్లో కొనసాగుతోంది.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

- డీఎంహెచ్‌వో శ్రీధర్



సూచనలిస్తున్న డీఎంహెచ్‌వో శ్రీధర్

గొల్లపల్లి(ధర్మపురి): ఇంటి పరిసరాల్లో నీటి నిల్వలు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, పరిశుభ్రత కోసం వారంలో ఒకరోజు 10 నిమిషాలు కేటాయించాలని జిల్లా వైద్యాధికారి శ్రీధర్ కోరారు. శుక్రవారం స్థానిక పీహెచ్‌సీని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇంటి పరిసరాల్లో నిరుపయోగంగా ఉన్న డ్రమ్ములు, పూలకుండీల్లో నీటిని శుభ్రం చేసి దోమలు వృద్ధి చెందకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. దోమకాటుతో విషజ్వరాలు ప్రబలుతాయని పేర్కొన్నారు. ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. దోమలను లార్వా దశలోనే నియంత్రించేందుకు ప్రజలు సహకరించాలని కోరారు. అనంతరం పాఠశాలలు, కళాశాలల్లో జిల్లా మలేరియా నియంత్రణ శాఖ ఆధ్వర్యంలో దోమల నివారణ మందు పిచికారీ చేయించారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారులు శ్రీనివాస్, రాధికరాణి, సత్యనారాయణ, సబ్ యూనిట్ ఆఫీసర్ శ్రీధర్, హెల్త్ సూపర్‌వైజర్ నరేందర్ పాల్గొన్నారు.

మత్తళ్లు దూకుతున్నాయ్..

- మూడురోజులుగా ఏకధాటి వానలు
- నిండిన ప్రాజెక్టులు, చెరువులు, కుంటలు
- పారుతున్న వాగులు, కల్వర్టులపై వరదలు
- పలు గ్రామాలకు స్తంభించిన రాకపోకలు
- అప్రమత్తమైన జిల్లా అధికార యంత్రాంగం

అత్యవసర సేవలకు హెల్ప్‌డెస్క్ :

95503 33241, 88858 81808



మత్తడి దుంకుతున్న కోరుట్ల మండలంలోని చిన్నమెట్‌పల్లి ఎల్లమ్మ చెరువు

జగిత్యాల: మూడురోజులుగా ఏకధాటిగా కురుస్తున్న వర్షాలతో జిల్లాలోని ప్రాజెక్టులు, చెరువులు, కుంటలు జలకళ సంతరించుకున్నాయి. వాగులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. వరద ధాటికి కొన్నిచోట్ల కల్వర్టులు ధ్వంసమయ్యాయి. చెట్లు విరిగిపడ్డాయి. విద్యుత్ స్తంభాలు పడిపోయాయి. రోడ్లపై కూడా వరద పారుతోంది. సారంగాపూర్ మండలం కోనాపూర్‌లో నిర్మాణంలోని వంతెన అప్రోచ్‌రోడ్డుపై వరద ఉధృతి పెరిగింది. రాకపోకలకు ఇబ్బందిగా మారింది. జగిత్యాల, సారంగాపూర్, బీర్‌పూర్, జన్నారం మార్గాల్లో ప్రయాణం చేసేవారు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు. పాఠశాలలకు సెలవులు ఇవ్వడంతో విద్యార్థులు ఇంటిపట్టునే ఉండిపోయారు. కానీ, ప్రభుత్వ, ప్రైవేట్ ఉద్యోగులు, సిబ్బంది, రైతులు, రైతు కూలీలు రోజువారి పనులకు వర్షంతో ఆటంకం ఏర్పడినా వెళ్లక తప్పలేదు.

సెలవులు రద్దు

జిల్లాలోని మున్సిపల్ సిబ్బందికి అధికారులు సెలవులు రద్దు చేశారు. కంట్రోల్‌రూమ్ వద్ద అందుబాటులో ఉండాలని ఆదేశించారు. పౌరులకు సేవల అందించాలని సూచించారు.

అందుబాటులోకి హెల్ప్‌డెస్క్

వరద బాధితులకు సాయం అందించేందుకు హెల్ప్‌డెస్క్ అందుబాటులోకి తీసుకొచ్చినట్లు జగిత్యాల మున్సిపల్ కమిషనర్ నరేశ్ తెలిపారు. లోతట్టు ప్రాంతాలు, శిథిలావస్థలోని భవనాల్లో నివసించే సురక్షిత ప్రాంతాలకు తరలివెళ్లాలని సూచించారు. అత్యవసర సేవల కోసం ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం6 గంటల వరకు హెల్ప్‌డెస్క్ నంబరు 95503 33241, 88858 81808ను సంప్రదించాలని ఆయన కోరారు.

బాలుడికి గాయాలు

కోరుట్లరూరల్: చిన్నమెట్‌పల్లిలో వర్షానికి రేకుల ఇల్లు కూలి పెడిమల్ల పృథ్వీరాజ(10) తలకు గాయాలయ్యాయి. పెడిమెల్ల భావన తన ముగ్గురు పిల్లలతో కలిసి ఇంట్లో నిద్రిస్తోంది. రాత్రి కురిసిన వర్షానికి పైకప్పు తడిచి విరిగిపడింది. భావన తన పిల్లలను తీసుకొని బయటకు పరుగెత్తింది. కుమారుడు పృథ్వీరాజ్ పోలియో బాధితుడు కావడంతో బయటకు వెళ్లలేకపోయాడు. రేకులు బాలుని తలపై పడటంతో గాయాలయ్యాయి.



ఆరవెల్లివాగు కల్వర్టుపై వరద ఉధృతి



జగిత్యాలలో విరిగిపడ్డ పెద్దచెట్టు

అప్రమత్తంగా ఉండాలి



రాబోయే మూడురోజులు భారీవర్షాలు కురిసే అవకాశం ఉందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ యాస్మిన్ బాషా కోరారు. ప్రధానంగా ప్రాణ, ఆస్తినష్టం సంభవించకుండా అధికారులు పకడ్బందీ చర్యలు తీసుకోవాలన్నారు. తన కార్యాలయంలో ఆమె విలేకరులతో మాట్లాడారు. ముంపు ప్రాంతాల ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించాలని ఆదేశించారు. రోడ్లు, వంతెనలు, చెక్‌డ్యామ్‌లు, కల్వర్టులు, వాగులపై వరదలు పారే చోట్ల రాకపోకలు నిలిపివేయాలని ఆదేశించారు. జాలరులు చేపల వేటకు వెళ్లవద్దన్నారు. పశువులను ఇళ్ల వద్దే ఉంచాలని చెప్పారు. జగిత్యాలలో టోల్‌ఫ్రీ నంబరు 08724-222557కు సమాచారం అందించాలని, ఈ టోల్‌ఫ్రీ నంబరును వాట్సాప్ గ్రూపుల్లో పోస్టు చేయాలని కలెక్టర్ ఆదేశించారు.

ప్రాణ, ఆస్తినష్టం జరగకుండా చూడండి



వరద పరిస్థితిపై సమీక్షిస్తున్న మంత్రి ఈశ్వర్

ధర్మపురి/వెల్గటూర్: గోదావరి వరదలతో తీరప్రాంతంలో ప్రాణ, ఆస్తినష్టం జరగకుండా అధికారులు అప్రమత్తంగా ఉండాలని మంత్రి కొప్పుల ఈశ్వర్ సూచించారు. పట్టణ శివారులోని గోదావరి వరద ఉధృతిని ఆయన పరిశీలించారు. మూడురోజులుగా విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయన్నారు. ఎగువన కురుస్తున్న భారీవర్షాలతో కడెం ప్రాజెక్టు గేట్లు ఎత్తి నీటిని గోదావరిలోకి వదిలారని, తద్వారా వరద ఉధృతి పెరుగుతోందని చెప్పారు. మత్స్యకారులు గోదావరిలోకి వెళ్లవద్దని, భక్తులు సురక్షిత ప్రదేశాల్లోనే స్నానాలు ఆచరించేలా అధికారులు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. కాగా, ఎండపెల్లి మండలంలోని గుల్లకోటకు చెందిన సుమారు 70 మంది మహిళలు, యువకులు బీఆర్‌ఎస్‌లో చేరారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మంత్రి కొప్పుల ఈశ్వర్ సమక్షంలో వారు పార్టీలో చేరారు. సీఎం కేసీఆర్ ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలతో ప్రతిపక్ష బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు తుడుచుపెట్టుకు పోతాయని పేర్కొన్నారు.

ఆత్మీయ సమ్మేళనం..

స్థానిక ఎస్‌హెచ్ గార్డెన్‌లో నియోజకవర్గ స్థాయి ఫీల్డ్ అసిస్టెంట్స్, ఎంప్లాయీస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఆత్మీయ సమ్మేళనానికి మంత్రి కొప్పుల ఈశ్వర్ హాజరయ్యారు. ప్రభుత్వం అండగా ఉంటుందని తెలిపారు. డీసీఎమ్మెస్ చైర్మన్ శ్రీకాంత్‌రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ సంగి సత్తమ్మ, ఎంపీపీ చిట్టిబాబు, జెడ్పీటీసీ బత్తిని అరుణ, ఏఎంసీ చైర్మన్ అయ్యోరి రాజేశ్ పాల్గొన్నారు.

విపత్తు యోధులు సిద్ధం..!



ఎల్‌ఎండీలో మాక్‌డ్రిల్ చేస్తున్న అధికారులు



సిద్ధంగా ఉన్న యోధ వాహనాలు

- వరదలను ఎదుర్కొనేందుకు ఫైర్‌సర్వీస్ సమాయత్తం
- సిబ్బందికి సెలవులు రద్దు చేసిన ఉన్నతాధికారులు
- స్పీడ్‌బోట్లు, వాహనాలు, ఎక్విప్‌మెంట్ సిద్ధం
- ఎల్‌ఎండీలో రెస్క్యూ ఆపరేషన్ మాక్‌డ్రిల్
- శిథిలాల్లో చిక్కిన వారిని రక్షించే ప్రత్యేక కెమెరాలు

సాక్షి ప్రతినిధి, కరీంనగర్: రాష్ట్రంలో జోరుగా కురుస్తున్న వర్షాల నేపథ్యంలో అన్నిశాఖలతోపాటే కీలకమైన ఫైర్‌సర్వీసు కూడా సిద్ధమైంది. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా అగ్నిమాపక సిబ్బందికి సెలవులు రద్దు చేసింది. దీంతో ఉమ్మడి జిల్లావ్యాప్తంగా లీవుల్లో ఉన్న సిబ్బంది అంతా ప్రభుత్వ అత్యవసర ఆదేశాలతో వెంటనే వచ్చి విధుల్లో చేరారని, 24 గంటలపాటు అందుబాటులో ఉన్నామని డిస్ట్రిక్ట్ ఫైర్ ఆఫీసర్(డీఎఫ్‌వో) తగరం వెంకన్న వెల్లడించారు. ఉమ్మడిజిల్లా వ్యాప్తంగా వర్షంతో ఎక్కడ ఎలాంటి వరదలు వచ్చినా.. లోతట్టు ప్రాంతాలు జలమయం అయినా.. వెంటనే అందుబాటులో ఉండేలా అన్నిఏర్పాట్లు చేసుకుంటున్నారు. ఆయా జిల్లాల కలెక్టర్లు, సీపీలు, ఎస్పీలతో నిరంతరం సమన్వయం చేసుకుంటూ నీటిపారుదల, రెవెన్యూ, పోలీసులతో సంప్రదింపులు జరుపుతూ, ఎక్కడ ఎలాంటి విపత్తు తలెత్తినా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నారు. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా వారి వద్దఉన్న మ్యాన్‌పవర్, ఎక్విప్‌మెంట్, యాక్షన్ ప్లాన్‌ని డీఎఫ్‌వో వెంకన్న ప్రభుత్వానికి సమర్పించారు.

ప్రత్యేక ఎక్విప్‌మెంట్..

ఫైర్‌సర్వీస్ వద్ద లైఫ్‌జాకెట్లు, ఇన్‌ఫ్లేటబుల్ బోట్లు, స్విమ్మర్లు, గ్లోవ్స్, రోప్స్, కరీంనగర్, మానకొండూరు, చొప్పదండి, హుజూరాబాద్, జమ్మికుంట, సిరిసిల్ల, జగిత్యాల, పెద్దపల్లిలో ఫైర్‌సర్వీస్ అధికారులు డీజీపీ ఆదేశాల మేరకు అత్యవసర సేవల్లో ఇప్పటికే చేరిపోయారు. ముఖ్యంగా ఎగువమానేరు, మధ్యమానేరు, లోయర్‌మానేరు, ఎల్లంపల్లి, గోదావరి పరీవాహక ప్రాంతాల వద్ద అగ్నిమాపక సిబ్బందిని ఇప్పటికే మోహరించారు. వానల తీవ్రత, మిడ్‌మానేరులో పరీవాహక ప్రాంతాల ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని కొత్తబోటు కొనేందుకు ఎస్పీ కూడా సుముఖత వ్యక్తం చేశారని అధికారులు వెల్లడించారు. ఇప్పటికే ఎల్‌ఎండీలో అగ్నిమాపక అధికారులు మాక్‌డ్రిల్ ప్రారంభించారు. పెద్దపల్లి జిల్లాకు చెందిన అగ్నిమాపక అధికారులు అవసరాన్ని బట్టి సింగరేణి రెస్క్యూ బృందాల సేవలను సైతం వినియోగించుకునే వీలుంది.

24 గంటలు అందుబాటులో ఉంటాం



ప్రభుత్వ ఆదేశాల మేరకు మేం 24 గంటలపాటు విధుల్లోనే ఉంటున్నాం. మా సిబ్బంది సెలవులు రద్దుచేసుకున్నారు. ప్రజలు ఎక్కడ నీటిలో చిక్కుకున్నా.. కాపాడేందుకు, లోతట్టు ప్రాంతాల వారిని సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు సిద్ధంగా ఉన్నాం.

– వెంకన్న, డీఎఫ్‌వో

విక్టిమ్ లోకేషన్ కెమెరా..

కరీంనగర్ జిల్లా అగ్నిమాపక కేంద్రంలో విక్టిమ్ లోకేషన్ కెమెరా అందుబాటులో ఉంది. వరద ఉధృతికి పాత ఇళ్లు కూలితే.. శిథిలాల్లో చిక్కుకున్న బాధితులను గుర్తించేందుకు ఉపయోగపడే కెమెరా ఇది. సుమారు 10 మీటర్ల కింద శిథిలాల్లో చిక్కుకున్న మనుషులు, జంతువులు.. ఏవైనా సరే దీని ద్వారా నేరుగా చూసే వీలు చిక్కుతుంది. అదేవిధంగా దీనిలో ఉండే కేబుల్ కెమెరా ద్వారా శిథిలాలకు రంధ్రం చేసిచూసే వీలుంటుంది. ఈ కెమెరా దాదాపు రూ.12 లక్షల విలువ చేస్తుందని అధికారులు తెలిపారు.

జలవనరుల డీఈగా అరుణోదయ్‌కుమార్

మెట్‌పల్లి(కోరుట్ల): జలవనరుల శాఖ మెట్‌పల్లి సబ్ డివిజన్ డీఈగా అరుణోదయ్‌కుమార్‌ను నియమించారు. ప్రస్తుతం గొల్లపల్లి డీఈగా పనిచేస్తున్న ఆయనను ఉన్నతాధికారులు మెట్‌పల్లికి బదిలీ చేశారు. ఆయన కొంతకాలం మెట్‌పల్లి ఏఈగా కూడా పనిచేశారు.

వేగవంతంగా ఉపాధి పనులు

జగిత్యాల: జిల్లావ్యాప్తంగా ఉపాధిహామీ పనులను వేగవంతం చేయాలని కలెక్టర్ యాస్మిన్ బాషా ఆదేశించారు. తన కార్యాలయంలో శుక్రవారం అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఎస్సీ, ఎస్టీ, చిన్న, సన్నకారు రైతులే ఈ పథకానికి అర్హులన్నారు. లబ్ధిదారులకు ఐదెకరాల భూమి మాత్రమే ఉండాలని, వారిని వీలైనంత త్వరగా ఎంపిక చేసుకుని జాబ్‌కార్డులు మంజూరు చేయాలన్నారు. అంచనాలు రూపొందించి పనులను వేగవంతం చేయాలని సూచించారు. ఉపాధిహామీ పథకం కింద పూలు, పండ్లతోటలు పెంచేందుకు అనుకూలంగా నేలలోని మట్టి పరీక్షలు చేయించాలన్నారు. గుంతలు తవ్వడానికి అనువైన స్థలాలను గుర్తించాలని పేర్కొన్నారు. లబ్ధిదారులకు అందించే రాయితీని నగదు రూపంలో నేరుగా బ్యాంకు ఖాతాల్లో జమచేయాలని అన్నారు. విద్యుత్, నీటి సౌకర్యం కల్పించేలా తగిన ఏర్పాట్లు చేయాలని చెప్పారు. కాళేశ్వరం ప్రాజెక్ట్ ద్వారా నీటికి ఎలాంటి ఇబ్బందులు లేవని, కుంటల్లో నీరు ఎప్పుడూ నిల్వ ఉంటుందని అన్నారు. గ్రామ, మండలస్థాయిలో ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. గ్రామాల్లో టామ్‌టామ్ వేయించేలా సర్పంచ్, కార్యదర్శులతో సమన్వయం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ దివాకర, డీఆర్డీఏ పీడీ లక్ష్మీనారాయణ, అధికారులు సురేశ్, ప్రతాప్ పాల్గొన్నారు.

ఆర్టీసీ డ్రైవర్ రాములుకు సజ్జనార్ అభినందన

మెట్‌పల్లి(కోరుట్ల): ఆర్టీసీ డ్రైవర్ రాములును ఆ సంస్థ ఎండీ సజ్జనార్ ట్విట్టర్ ద్వారా అభినందించారు. పట్టణంలోని కొత్త బస్టాండ్ వద్ద గురువారం ఆర్టీసీ బస్సు కిందపడి ఓ మహిళ ఆత్మహత్యకు యత్నించగా, డ్రైవర్ రాములు వెంటనే అప్రమత్తమై బస్సును నిలిపివేశాడు. ఈ సంఘటనలో ఆమెకు ప్రాణాప్రాయం తప్పింది. గాయాలతో ప్రస్తుతం హైదరాబాద్‌లోని ఓ ఆస్పత్రిలో ఆమె చికిత్స పొందుతోంది. విషయం తెలుసుకున్న ఎండీ సజ్జనార్.. డ్రైవర్‌ను అభినందించారు. 'చాకచక్యం, అప్రమత్తతతో నిండు ప్రాణం నిలిచింది. సమయస్ఫూర్తితో వ్యవహరించి ఓ మహిళ ప్రాణాలు కాపాడిన డ్రైవర్ రాములుకు అభినందనలు' అని సజ్జనార్ ట్విట్టర్‌లో పోస్ట్ చేశారు.

క్లుప్తంగా

జెడ్పీ చైర్‌పర్సన్‌ను కలిసిన డీఎస్పీ



పుష్పగుచ్ఛం అందిస్తున్న డీఎస్పీ

జగిత్యాలరూరల్‌: జగిత్యాల డీఎస్పీగా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన వెంకటస్వామి.. శుక్రవారం జెడ్పీ చైర్‌పర్సన్‌ దావ వసంతను కలిశారు. మర్యాదపూర్వకంగా కలిసి ఆమెకు పుష్పగుచ్ఛం అందజేశారు.

కలెక్టర్‌ను కలిసిన డీఎస్పీ

జగిత్యాల: కలెక్టర్‌ యాస్మిన్‌బాషాను జగిత్యాల డీఎస్పీ వెంకటస్వామి శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాన్ని అందజేశారు. ఇటీవల జగిత్యాల డీఎస్పీగా బదిలీపై వచ్చిన వెంకటస్వామి.. తొలిసారి కలెక్టర్‌ను కలువగా, కలెక్టర్‌ డీఎస్పీని అభినందించారు.

కుక్కల దాడిలో 12 మందికి గాయాలు

కోరుట్ల: పట్టణంలోని పలు ప్రాంతాల్లో కుక్కలు చేసిన దాడుల్లో 12 మంది గాయాలపాలయ్యారు. శుక్రవారం గోదాం రోడ్డు, కల్లూర్‌ రోడ్డు, గాంధీరోడ్డులో కుక్కలు స్వైరవిహారం చేశాయి. వాటి దాడుల్లో అబ్దుల్‌ ఖాలిక్‌(5), సత్తార్‌ (28), దీపాంకిత(10), అతఖ(7), ధన్‌రాజ్‌(34), సాయిపల్లవి(7), జోయ (8), మిథ్యు(27), అయాన్‌(7), దక్షిత(7), మురళి(12), దామోదర్‌(9) గాయపడ్డారు. వారందిరికీ స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స చేశామని సూపరింటెండెంట్‌ సునీత తెలిపారు. 12 మందిలో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయని పేర్కొన్నారు. మిగతా వారికి స్వల్ప గాయాలుకాగా చికిత్సచేసి ఇళ్లకు పంపించామని వివరించారు. పట్టణ ప్రజలను కుక్కల బెడద నుంచి కాపాడాలని ప్రజలు కోరుతున్నారు.

వృద్ధులను వేధిస్తే చర్యలు



ఆర్డీవోను అభినందిస్తున్న ప్రతినిధులు

జగిత్యాల: వయోవృద్ధులను వేధించినా, నిరాదారణకు గురిచేసినా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఆర్డీవో నర్సింహమూర్తి హెచ్చరించారు. శుక్రవారం సీనియర్‌ సిటిజన్స్‌తో ఆయన తన కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. వయోధికుల సంరక్షణ చట్టం సెక్షన్‌ – 24 ప్రకారం వృద్ధ తల్లిదండ్రులను వేధించరాదని, నిరాదరణకు గురిచేయరాదన్నారు. చట్టాన్ని అతిక్రమిస్తే మూడు నుంచి ఆరు నెలల వరకు జైలు శిక్ష ఉందని పేర్కొన్నారు. సీనియర్‌ సిటిజన్స్‌ హరి అశోక్‌కుమార్‌, దేశాయి, విశ్వనాథం, హన్మంతరెడ్డి, యాకూబ్‌, సతీశ్‌, మానాల కిషన్‌ తదితరులు పాల్గొన్నారు.

పండ్ల తోటల పెంపకానికి రాయితీ

- ఉపాధి హామీ కింద ఉద్యానశాఖ ప్రోత్సాహకాలు
- మామిడి, నిమ్మ వంటి తోటలకు మూడేళ్ల పాటు సబ్సిడీ
- ఎస్సీ, ఎస్టీ, చిన్న, సన్నకారు రైతులకు అవకాశం
- ఈనెల 31 లోపు దరఖాస్తులకు గడువు



మూడేళ్ల వయస్సులో ఉన్న మామిడి తోట

జగిత్యాలఅగ్రికల్చర్‌: జిల్లాలో పండ్ల తోటలు పెంచేందుకు ఉద్యానశాఖ పలు ప్రోత్సాహకాలు ప్రకటించింది. ఈ మేరకు గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద ఎస్సీ, ఎస్టీ, చిన్న, సన్నకారు రైతులు పండ్ల తోటలు సాగు చేస్తే మూడేళ్ల వరకు రాయితీలు అందించాలని నిర్ణయించింది. ఇందుకు సంబంధించి ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. దీంతో దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియను ఉద్యానశాఖ,ఉపాధి హామీ అధికారులు ప్రారంభించారు.

రాయితీల వివరాలు..

మామిడి, నిమ్మ, బత్తాయి, జామ, సీతాఫల్‌, సపోటా, దానిమ్మ, మునగ, డ్రాగన్‌ఫ్రూట్‌, కొబ్బరి తోటలు సాగు చేసే రైతులకు సబ్సిడీ ఇవ్వాలని ఉద్యానశాఖ నిర్ణయించింది. ఒక్క ఎకరంలో నాటే మొక్కలను బట్టి మూడేళ్లకు కలిపి సబ్సిడీ ఇవ్వనుంది.

- ఎకరానికి 70 మామిడి మొక్కలు నాటితే రూ.56,433, మామిడి 81 మొక్కలు నాటితే రూ.65,302, 110 మొక్కలు నాటితే రూ.88,682, 160 మొక్కలు నాటితే రూ.1,28,992 సబ్సిడీ ఇవ్వనున్నారు.
- ఎకరంలో నిమ్మ మొక్కలు 110 నాటితే రూ.69,403, ఎకరంలో బత్తాయి 100 మొక్కలు నాటితే రూ.63,118, ఎకరంలో జామ 110 మొక్కలు నాటితే రూ.70,063 రాయితీ ఇవ్వనున్నారు.
- ఎకరంలో సీతాఫల్‌ 160 మొక్కలు నాటితే రూ.1,00,986, ఎకరంలో సపోటా 60 మొక్కలు నాటితే రూ.47,264, ఎకరంలో దానిమ్మ 265 మొక్కలు నాటితే రూ.1,21,499 సబ్సిడీ ఇవ్వనున్నారు.
- ఎకరంలో మునగ 1,000 మొక్కలు నాటితే రూ.94,892, అర ఎకరంలో డ్రాగన్‌ఫ్రూట్‌ 900 మొక్కలు నాటితే రూ.3,50,272, కొబ్బరి 40 మొక్కలు నాటితే రూ.32,487 రాయితీ ఇవ్వనున్నారు.

ఎప్పుడెప్పుడు ఇస్తారంటే..

పండ్ల తోటలు సాగు చేసే భూమిలో మట్టి నమూనా సేకరణ, మట్టి పరీక్షకు రాయితీ ఇస్తారు. అలాగే మొక్కలు నాటేందుకు గుంతలు తవ్వడం, నాటుట, ఊత కర్రలు పాతడం కోసం రాయితీ ఇచ్చి, మొక్కల ఖరీదు కూడా చెల్లిస్తారు. పండ్ల తోట నాటిన ఏడాదితో పాటు మరో రెండేళ్ల పాటు రాయితీని రైతు బ్యాంకు అకౌంట్లో జమ చేస్తారు. ఎరువుల కోసం ఒక్కో మొక్కకు ఏడాదికి రూ.50 ఇస్తారు. అలాగే తోటను సంరక్షించేందుకు ప్రతినెలా మొక్కకు రూ.10 చొప్పున రైతు బ్యాంకు ఖాతాలో వేస్తారు.

జిల్లాలో 1,865 ఎకరాల లక్ష్యం

జిల్లాకు ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి పండ్ల తోటల పెంపకం కోసం 1,865 ఎకరాలు కేటాయించారు. ఈ పథకంలో లబ్ధి పొందాలంటే పండ్ల తోటలకు అనువైన భూమితో పాటు సాగు నీటి సౌకర్యం ఉంటేనే రాయితీ అందిస్తారు. అలాగే రైతు తప్పనిసరిగా ఉపాధి హామీ జాబు కార్డు కలిగిఉండాలి. ఐదెకరాల లోపు ఉన్న ఎస్సీ, ఎస్టీ, చిన్న, సన్నకారు రైతులు మాత్రమే ఈ పథకానికి అర్హులు. రాయితీ పొందాలనుకునే రైతులు ఉద్యానశాఖాధికారి లేదా మండల వ్యవసాయాధికారి లేదా ఎంపీడీఓలు లేదా గ్రామీణ ఉపాధి హామీ పథకానికి చెందిన ఫీల్డ్‌ అసిస్టెంట్లు, టెక్నికల్‌ అసిస్టెంట్‌లను సంప్రదించాలి. ఈ మేరకు ఈనెల 31 లోపు దరఖాస్తు చేసుకోవాలని ఉద్యానశాఖాధికారులు పేర్కొన్నారు.

రైతులకు మంచి అవకాశం



పండ్ల తోటలు సాగు చేసే రైతులకు ఈ పథకం మంచి అవకాశం. మూడేళ్ల వరకు నాటిన ప్రతీ మొక్కకు రాయితీ ఇస్తారు. గ్రామాల్లోని ఉపాధి హామీ ఫీల్డ్‌ అసిస్టెంట్లు లేదా ఉద్యానశాఖాధికారులను కలిసి దరఖాస్తు చేసుకోవాలి

– ప్రతాప్‌సింగ్‌, జిల్లా ఉద్యానశాఖాధికారి

చిన్న, సన్నకారు రైతులకు..



ఎస్సీ, ఎస్టీ, చిన్న, సన్నకారు రైతులకు ఇది సువర్ణావకాశం. చాలా మంది దరఖాస్తు చేసేందుకు ముందుకు వస్తున్నారు. మొక్క నాటినప్పటి నుంచి మూడేళ్ల వరకు రాయితీ ఇవ్వబడును.

– లక్ష్మీనారాయణ, డీఆర్‌డీఏ పీడీ

గోదావరి వరద పరిశీలన



వరద ఉధృతి పరిశీలిస్తున్న జీవన్‌రెడ్డి

సారంగాపూర్‌(జగిత్యాల): బీర్‌పూర్‌ మండలం కమ్మునూర్‌ వద్ద గోదావరి ఉధృతంగా ప్రవహిస్తుండగా ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి శుక్రవారం సాయంత్రం పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ఆలస్యంగానైనా వర్షాలు కురుస్తున్నాయన్నారు. ప్రస్తుతం ఎల్లంపల్లి ప్రాజెక్టు వరద నీటితో నిండిన క్రమంలో అక్కడినుంచి మిడ్‌మానేరుకు నీటిని తరలించాలన్నారు. బీర్‌పూర్‌ రోళ్లవాగు ప్రాజెక్టులోకి ఎగువ నుంచి నీరు వస్తున్నా స్లూయిస్‌కు గేట్లు బిగించకపోవడంతో నీరు వృథాగా బయటకు వెళ్లిపోతోందని తెలిపారు. తక్షణమే మూడు స్లూయిస్‌లకు గేట్లు(షటర్స్‌) బిగించాలని కోరారు. ఆయన వెంట కాంగ్రెస్‌ పార్టీ జిల్లా అధ్యక్షుడు అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌, ఎంపీపీ మసర్తి రమేశ్‌, నాయకులు గుడిసె జితేందర్‌, కోండ్ర రాంచంద్రారెడ్డి తదితరులు ఉన్నారు.

మండల పరిషత్‌లో విద్యుదాఘాతం

ముస్తాబాద్‌(సిరిసిల్ల): ముస్తాబాద్‌ మండల పరిషత్‌లో మరోసారి విద్యుదాఘాతం జరిగింది. రెండు నెలల క్రితమే విద్యుదాఘాతంతో ఎంపీవో చాంబర్‌ కాలిపోయిన ఘటన మరువక ముందే శుక్రవారం మండల పరిషత్‌లో మరోసారి షార్ట్‌సర్క్యూట్‌ జరిగింది. ఎంపీడీవో చాంబర్‌లో ట్యూబ్‌లైట్ల నుంచి పొగలు రావడంతో మంటలు లేచాయి. సిబ్బంది పనిచేసే గదిలో కేబుల్‌ నుంచి మంటలు, పొగ వ్యాపించాయి. దీంతో రెండు కంప్యూటర్లు, ఫ్యాన్లు, లైట్లు కాలిపోయాయని, సుమారు రూ.లక్ష వరకు నష్టం జరిగిందని ఎంపీడీవో రమాదేవి తెలిపారు.

వైద్యశాఖలో 'భానమతి' భయం

- వేములవాడ ఉద్యోగికి బెదిరింపు లేఖ
- కరీంనగర్‌లో కుటుంబికుల ఫిర్యాదు
- కేసు నమోదు చేసిన పోలీసులు
- జిల్లాలో వైరల్‌ అవుతున్న ఎఫ్‌ఐఆర్‌



పోలీసులకు నాగరాజు భార్య అందించిన ఫిర్యాదు



కేసు నమోదు చేసిన కరీంనగర్‌ పోలీసులు, ఎఫ్‌ఐఆర్‌

సిరిసిల్లక్రైం: శాస్త్రీయతతో ప్రాణాలను కాపాడే వైద్యులు ఉండే వైద్యశాఖలోని ఉద్యోగులు భానమతి(చేతబడి) పేరిట బెదిరింపులకు పాల్పడగా పోలీసులను ఆశ్రయించిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. రాజన్నసిరిసిల్ల జిల్లాలోని వేములవాడ ప్రభుత్వ ఆస్పత్రిలో పనిచేసే ఉద్యోగికి అదేశాఖలో పనిచేసే మరో ఉద్యోగికి ఉన్న విభేదాలను సరిచేయడానికి చేతబడిని ఎంచుకోవడం, ప్రాణభయం ఉందని బాధిత ఉద్యోగి కుటుంబీకులు ఠాణా మెట్లు ఎక్కడంతో పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ ఎఫ్‌ఐఆర్‌ కాపీ సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు కొడుతోంది. వివరాలు ఇలా ఉన్నాయి. సిరిసిల్ల వైద్య ఆరోగ్యశాఖలోని సూపరింటెండెంట్‌ తమ్మిశెట్టి నాగరాజు డిప్యూటేషన్‌పై వేములవాడ ప్రభుత్వ ఆస్పత్రిలో పనిచేస్తున్నాడు. పదోన్నతి విషయంలో మరొకరితో వివాదం ఉంది. దీనికి సంబంధించిన అన్ని అంశాలను కోర్టుకు సమర్పించగా కోర్టు నాగరాజు పదోన్నతికి అనుకూలంగా తీర్పు వచ్చింది. ఇది అమలుకావడం లేదని నాగరాజు మరో పిటిషన్‌ వేశాడు. ఇదిలా ఉండగా ఈనెల 5న నాగరాజు నివాసానికి ఓ ఉత్తరం వచ్చింది. ఈనెల 17లోగా కోర్టులోని కేసు వాపస్‌ తీసుకోవాలని లేకుంటే ఇంట్లోని వారందరికీ భానమతి(చేతబడి) చేయించి చంపేస్తామని బెదిరింపులు ఉన్నాయి. అంతేకాదు నాగరాజు లంచగొండి, కోర్టులో తప్పుడు కేసులు వేస్తాడని, అమ్మాయిలను మోసం చేస్తాడని రాసి ఉంది. వెంటనే నాగరాజు భార్య లెటర్‌ వచ్చిన ఏరియాలోని పోస్టాఫీస్‌ సీసీ ఫుటేజీలు కావాలని హైదరాబాద్‌ హెడాఫీస్‌కు విన్నవించడి.. వారు సీసీ ఫుటేజీలు ఇచ్చారు. సీసీఫుటేజీల్లో జగిత్యాల వైద్యశాఖలో పనిచేసే సూపరింటెండెంట్‌ అహ్మద్‌ హుస్సేన్‌గా గుర్తించారు. కోర్టు కేసులో గెలిచి నాగరాజుకు పదోన్నతి వస్తే అదే శాఖలో పనిచేసే అహ్మద్‌ హుస్సేన్‌ పదోన్నతికి ఆటంకం కలుగుతుందన్న దురుద్దేశ్యంతోనే చేతబడి పేరిట బెదిరింపు లేఖ రాసినట్లు కరీంనగర్‌ టూటౌన్‌లో నాగరాజు భార్య ఈనెల 11న ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. వైద్యశాఖలో ఉన్న ఇద్దరు ఉద్యోగులు మూఢనమ్మకాల పేరిట బెదిరింపులు చేసుకోవడం చర్చనీయాంశమైంది.

కామన్‌ సర్వీస్‌ సెంటర్లు ప్రారంభం

జగిత్యాలఅగ్రికల్చర్‌: సహకార రంగంలోని ప్రాథమిక సహకార సంఘాలను బలోపేతం చేసేదిశలో శుక్రవారం ఢిల్లీ వేదికగా కేంద్ర హోం, సహకారమంత్రి అమిత్‌షా దేశవ్యాప్తంగా కామన్‌ సర్వీస్‌ సెంటర్లు వర్చువల్‌ విధానంలో ప్రారంభించారు. జిల్లా కేంద్రంలో జిల్లా సహకార అధికారి రామానుజాచార్యులు, సహకార సంఘాల అధ్యక్షులు, సీఈవోలు హాజరయ్యారు. జిల్లా సహకార అధికారి రామానుజాచారి మాట్లాడుతూ, సహకార సంఘాలను బలోపేతం చేసేందుకు కామన్‌ సర్వీసెస్‌ సెంటర్ల ద్వారా 300 రకాల సేవలను సభ్యులకు అందిస్తామన్నారు. భారతీయ జన ఔషధ కేంద్రాలతోపాటు వంటగ్యాస్‌, డీజిల్‌, పెట్రోల్‌ ఔట్‌లెట్స్‌ ప్రారంభించి గ్రామీణ ప్రజలకు సేవలు అందించాలని నిర్ణయించినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో డీసీఎమ్మెఎస్‌ చైర్మన్‌ శ్రీకాంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కాపర్‌వైర్‌ చోరీ : నిందితుల అరెస్ట్‌



వివరాలు వెల్లడిస్తున్న పోలీసులు

మెట్‌పల్లి(కోరుట్ల): పట్టణంలోని సబ్‌స్టేషన్‌లో కాపర్‌వైర్‌ చోరీ చేసిన కేసులో ముగ్గురు నిందితులను పోలీసులు అరెస్ట్‌ చేశారు. ఇందుకు సంబంధించిన వివరాలను డీఎస్పీ రవీందర్‌రెడ్డి శుక్రవారం విలేకరులకు వెల్లడించారు. గతనెల 27న స్థానిక సబ్‌స్టేషన్‌లో నిల్వఉంచిన రూ.6లక్షల విలువైన 600కేజీల కాపర్‌వైర్‌ను దొంగలు అపహరించారు. విద్యుత్‌ అధికారుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. అయితే శుక్రవారం స్థానిక ఆరపేట వద్ద వాహనాలను తనిఖీ చేస్తుండగా, అటువైపు టవేరా వాహనాంలో వస్తున్న మంచిర్యాల జిల్లా మందమర్రికి చెందిన హన్మంతు, నరేశ్‌, పవన్‌ పోలీసులను చూసి పారిపోవడానికి ప్రయత్నించారు. వెంటనే వారిని పట్టుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించి విచారించగా, చోరీ తామే చేసినట్లు అంగీకరించారు. వారినుంచి కాపర్‌ను కొనుగోలు చేసిన రమేశ్‌ను కూడా అదుపులోకి తీసుకున్నారు. చోరీ కేసులో ముగ్గురు నిందితులు.. జైపూర్‌ వద్ద 400 కేజీల కాపర్‌వైర్‌ను చోరీ చేశారు. సబ్‌స్టేషన్‌లో అపహరించిన కాపర్‌ను స్వాధీనం చేసుకొని నలుగురిని రిమాండ్‌కు తరలించారు. నిందితులను పట్టుకున్న సీఐ లక్ష్మీనారాయణ, ఎస్‌ఐ శ్యాంరాజ్‌ తోపాటు పోలీసు సిబ్బందిని డీఎస్పీ అభినందించారు.

దొంగతనం కేసులో ముగ్గురి అరెస్ట్‌

- రూ. 1.20లక్షల సామగ్రి స్వాధీనం



వివరాలు వెల్లడిస్తున్న సీఐ కోటేశ్వర్‌, ఎస్సై సతీశ్‌

పెగడపల్లి(ధర్మపురి): అయితిపల్లి గ్రామంలో హార్వెసర్ల చైన్లు(గొలుసులు) దొంగిలించిన ముగ్గురిని అరెస్టు చేసినట్లు మల్యాల సీఐ కోటేశ్వర్‌ తెలిపారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో శుక్రవారం ఎస్సై సతీశ్‌తో కలిసి సీఐ వివరాలను వెడించారు. హార్వెసర్ల చైన్లు చోరీకి గురైనట్లు యాజమానులు ఇటీవల పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన ఎస్సై.. సిబ్బందితో కలిసి గాలింపు చర్యలు చేపట్టారు. ఈ క్రమంలో శుక్రవారం నందగిరి ప్రాంతంలో పెట్రోలింగ్‌ చేస్తున్న పోలీసులకు దొంగల సమాచారం అందింది. దీంతో అయితిపల్లి గ్రామానికి చేరుకున్న పోలీసు సిబ్బందికి ఇదే మండలంలోని నందగిరి గ్రామానికి చెందిన ఎండీ షబీర్‌, గర్వంద వేణు, సామవేని వెంకటేశ్‌ తారసపడ్డారు. పోలీసులను చూసి పరుగెత్తే ప్రయత్నం చేశారు. వెంటనే వారిని అదుపులోకి తీసుకున్న పోలీసులు.. వారిచేతిలోని సంచులను తనిఖీ చేశారు. అందులో సుమారు రూ.1.20 లక్షల విలువైన హార్వెస్టర్‌ చైన్లు(గొలుసులు) లభించాయి. వారిని విచారించగా హార్వెస్టర్‌ చైన్లు దొంగిలించినట్లు అంగీకరించారు. ముగ్గురు నిందితులను కోర్టులో హాజరు పరిచినట్లు సీఐ వివరించారు. నిందితులను పట్టుకునేందుకు కృషి చేసిన సీఐ కోటేశ్వర్‌, ఎస్సై సతీశ్‌, ఏఎస్సై సత్తయ్య, పీసీలు వెంకటేశ్‌, ఎల్లయ్య, సంపత్‌ను ఎస్పీ భాస్కర్‌, డీఎస్పీ వెంకటస్వామి అభినందించారు.

బండి సంజయ్‌ని పదవి నుంచి తప్పించారని..



చికిత్స పొందుతున్న అజయ్‌వర్మ



మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌కు తరలింపు

గన్నేరువరం(మానకొండూర్‌): రాష్ట్ర అధ్యక్షుడి హోదా నుంచి బండి సంజయ్‌ని తప్పించారని మనోవేదన చెందిన అతని ప్రధాన అనుచరుడు గన్నేరువరం మండలం గునుకుల కొండాపూర్‌కు చెందిన సొల్లు అజయ్‌వర్మ శుక్రవారం తన వ్యవసాయక్షేత్రంలో పురుగుల మందుతాగి ఆత్మహత్యకు యత్నించాడు. ఈ విషయాన్ని ఫోన్‌ద్వారా తనమిత్రులు కొంకటి అనిల్‌, బోయిని అభిషేక్‌కు చెప్పడంతో వెంటనే కారులో కరీంనగర్‌లోని ఓ ఆస్పత్రిలో చేర్పించారు. ఈ క్రమంలో ఆత్మహత్యాయత్నానికి గల కారణాలకు సంబంధించిన ఓ వీడియో విడుదల చేశారు. బండి సంజయ్‌ అధ్యక్షపదవి చేపట్టినప్పటి నుంచి మహా సంగ్రామయాత్రతో పార్టీని గల్లీగల్లీలో విస్తరించాడని, పదిహేనేళ్లుగా సంజయ్‌ వెంటనే నడుస్తున్నట్లు అజయ్‌ వర్మ వీడియోలో పేర్కొన్నాడు. అధిష్టానం అధ్యక్ష పదవి నుంచి తొలగించడం బాధాకరమని, ఆ బాధతో తాను బాత్‌రూంలోకి వెళ్లి ఏడ్చానని, సోషల్‌ మీడియాలో కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి వాఖ్యలు విన్న తరువాత మరింత కుమిలిపోయానని ఆవేదన వ్యక్తం చేశాడు. దీంతోనే తాను పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించానని తెలిపారు. తన చావుతోనైనా సంజయ్‌కి కేంద్రమంత్రి పదవితో పాటు సీఎం అభ్యర్థిగా ప్రకటించాలని కోరాడు. అజయ్‌వర్మ మానకొండూర్‌ నియోజకర్గం నుంచి బీజేపీ టికెట్‌ ఆశిస్తున్నాడు. విషయం తెలుసుకున్న ఎంపీ బండి సంజయ్‌ ఫోన్‌లో డాక్టర్లతో, బీజేపీ నాయకులతో మాట్లాడారు. అజయ్‌వర్మను మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌కు తరలించారు.

గుండెపోటుతో కరీంనగర్‌ డీఐఈవో మృతి



నివాళి అర్పిస్తున్న కలెక్టర్‌ కర్ణన్‌

కరీంనగర్‌: కరీంనగర్‌ జిల్లా ఇంటర్మీడియట్‌ విద్యాధికారి(డీఐఈవో) టి.రాజ్యలక్ష్మి శుక్రవారం ఉదయం 10.20 నిమిషాలకు గుండెపోటుతో మృతి చెందారు. ఉదయం వారి నివాసంలో ఒక్కసారిగా కుప్పకూలిపోవడంతో జిల్లాకేంద్రంలోని ఓ ప్రైవేట్‌ ఆసుపత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. గత మూడున్నరేళ్లుగా జిల్లా ఇంటర్మీడియట్‌ విద్యాధికారిగా విధులు నిర్వహిస్తున్న రాజ్యలక్ష్మి టైపిస్టుగా ఉద్యోగంలో చేరి జూనియర్‌ లెక్చరర్‌గా, ప్రిన్సిపల్‌గా, డీఐఈవోగా సేవలందించారు. భర్త పోస్టల్‌ డిపార్ట్‌మెంట్‌లో చేసి గతంలోనే పదవీ విరమణ పొందారు. వీరికి కుమార్తె, కుమారుడు ఉన్నారు. స్వస్థలం సిరిసిల్ల జిల్లా అయినప్పటికి 30ఏళ్ల క్రితం ఉద్యోగరీత్యా కరీంనగర్‌లోని చైతన్యపురిలో స్థిరపడ్డారు. రాజ్యలక్ష్మి భౌతికకాయానికి కలెక్టర్‌ ఆర్వీ కర్ణన్‌, అదనపు కలెక్టర్‌ శ్యాంప్రసాద్‌లాల్‌, అల్ఫోర్స్‌ విద్యాసంస్థల చైర్మన్‌ నరేందర్‌రెడ్డి, తదితరులు నివాళి అర్పించారు.

డబుల్‌ డెక్కర్‌ స్కైవే ఏర్పాటుకు సానుకూలం



రాజ్‌నాథ్‌ సింగ్‌ను కలిసిన కేటీఆర్‌, వినోద్‌(ఫైల్‌)



డబుల్‌ డెక్కర్‌ స్కైవే మోడల్‌

సాక్షి ప్రతినిధి, కరీంనగర్‌: హైదారాబాద్‌లోని జేబీఎస్‌ నుంచి శామీర్‌పేట మధ్యలో డబుల్‌ డెక్కర్‌ స్కైవే నిర్మాణంతో కరీంనగర్‌–హైదరాబాద్‌ మధ్యలో ప్రయాణానికి మహర్దశ కలగనుంది. ఇటీవల ఈ ప్రతిపాదనను కేంద్రం వద్ద ఉంచినప్పుడు కేంద్రం సానుకూలత వ్యక్తం చేశారని ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు బి.వినోద్‌కుమార్‌ శుక్రవారం వెల్లడించారు. డబుల్‌ డెక్కర్‌ స్కైవే మూడంచెల పద్ధతి ఉంటుందని, పైభాగంలో మెట్రో రైలు, మధ్యలో ఫ్లైఓవర్‌, కింది భాగంలో రోడ్డు ఉంటుందని వివరించారు. పనులు పూర్తిఅయ్యే నాటికి దాదాపు ఐదువేల కోట్ల రూపాయలు ఖర్చు అవుతుందని అంచనా వేస్తున్నట్లు వివరించారు. కరీంనగర్‌ మార్గంలో హైదారాబాద్‌ నుంచి శామీర్‌పేట వరకు 18.5 కిలో మీటర్ల డబుల్‌ డెక్కర్‌ స్కైవే నిర్మాణంతో సిద్దిపేట, కరీంనగర్‌ జిల్లా, పెద్దపల్లి, మంచిర్యాల, ఆసిఫాబాద్‌ జిల్లా ప్రజలకు హైదారాబాద్‌ కు సాఫీగా రాకపోకలు సాగించేందుకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. ఇటీవల మంత్రి కేటీఆర్‌, ఎంపీలు కొత్త ప్రభాకర్‌ రెడ్డి, రంజిత్‌ రెడ్డిలతో కలిసి తాను కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌ నాథ్‌ సింగ్‌ తో జరిపిన చర్చల ఫలితంగా ఈ ప్రతిపాదనలు కొలిక్కి వచ్చినట్లు తెలిపారు.

'కేంద్ర ప్రభుత్వ విధానాలను వ్యతిరేకించాలి'



మాట్లాడుతున్న వీరయ్య

కోరుట్ల: కేంద్ర ప్రభుత్వ విధానాలను ప్రజలు వ్యతిరేకించాలని సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఎస్‌.వీరయ్య కోరారు. సీపీఎం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో పట్టణంలో శుక్రవారం శిక్షణ తరగతులు ప్రారంభమయ్యాయి. వీరయ్య మాట్లాడుతూ కేంద్రంలోని నరేంద్రమోదీ ప్రభుత్వం దేశంలో 75 ఏళ్లకింతం నాటి ప్రజల ఆస్తులను బడా కార్పొరేట్‌ సంస్థలకు కారుచౌకగా విక్రయించిందని ఆరోపించారు. రాష్ట్రంలో బీజేపీ మతకలహాలు సృష్టోందని పేర్కొన్నారు. మహిళలపై అత్యాచారాలు, హత్యలు పెరిగాయని ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన సమగ్ర సర్వే ప్రకారం 30 లక్షల మంది ఇళ్లు లేనినిరుపేదలు ఉన్నారని తెలిపారు. వారందరికీ ఇళ్ల పట్టాలు ఇవ్వాలని డిమాండ్‌ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు లెల్లెల బాలకృష్ణ, జి.తిరుపతి, ఇందూరి సులోచన, ఎల్ల పోచయ్య, గుమ్మడి రమేశ్‌ తదితరులు పాల్గొన్నారు.

నలుగురు ఎస్సైలకు సీఐలుగా పదోన్నతి

గోదావరిఖని: ఉమ్మడి కరీంనగర్‌ జిల్లాలో నలుగురు ఎస్సైలకు సీఐలుగా పదోన్నతి కల్పిస్తూ మల్టీజోన్‌ ఐజీ చంద్రశేఖర్‌రెడ్డి శుక్రవారం ఆదేశాలు చేశారు. కరీంనగర్‌లో విధులు నిర్వహిస్తున్న కె.అంజయ్య, సిరిసిల్లకు చెందిన జి.శ్రీనివాస్‌, రామగుండంకు చెందిన ముస్కెం శ్రీనివాస్‌, జోన్‌–3 రాజన్న సిరిసిల్ల జిల్లాకు చెందిన లింగంపెల్లి నరేందర్‌కు పదోన్నతి లభించింది.